

ఈదురుగాలుల బీభత్సం

పశ్చిమ ప్రకాశంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో పాటు వర్షం కురిసింది. - 8లో..



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 44/29

వాతావరణం

ఆకాశం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్యశ్రీ సేవలు యథాతథం

- వదంతులు నమ్మవద్దు
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు



ఒంగోలు: ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా జరుగుతాయని, నిలిపివేస్తున్నట్లుగా విని పిస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీని మరింత మెరుగ్గా అమలు చేసి ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో కేవలం 1,059 వ్యాధులు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్యను 3,255కు పెంచామన్నారు. ఇటీవలే గర్భిణులకు అవసరమైన స్కానింగ్ పరీక్షలను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చడం ద్వారా పేదలకు మరింత అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలిచిందన్నారు. గత నెల 30న రూ.201 కోట్లు, ఈ నెల 15న రూ.205 కోట్లు, ఈ నెల 18న రూ.368 కోట్లు కలిపి మొత్తం రూ.774 కోట్లను కేవలం 19 రోజుల్లోనే చెల్లించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ నాయకులతో కూడా ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రతినిధులు మాట్లాడటం జరిగిందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి, మిగిలిన బకాయిలకు సంబంధించి సానుకూల నిర్ణయం వెలువడటంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు కూడా వైద్య సేవలకు అంతరాయం లేకుండా సేవలందిస్తామని ప్రకటించారని అశోక్‌బాబు వివరించారు. అందువలన ప్రజలు ఎటువంటి వదంతులను నమ్మవద్దని ఆయన సూచించారు.

మితిమీరిన రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పలు అనర్థాలకు దారితీస్తోంది. భూమిలో సత్తువ తగ్గిపోతోంది. ఖర్చులు సైతం పెరిగి అన్నదాతకు సేద్యం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది కొత్తగా మరో 98 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సహజం.. బహు బాగు..!



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పొట్లకాయలు

- ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఇప్పటికే 240 గ్రామాల్లో పంటల సాగు
- ఈ ఏడాది కొత్తగా 98 వేల ఎకరాలు లక్ష్యం
- ప్రతి ఆర్‌బీకే పరిధిలో సాగు చేయించేందుకు ప్రణాళికలు
- ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ధాన్యానికి అధిక ధరలు
- శనగకు 10 శాతం అధిక ధరతో టీటీడీ కొనుగోలు



వజ్జిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా చామదుంప సాగుచేస్తున్న రైతు వెంకటేశ్వర్లరెడ్డి

కొత్తపట్నం: జిల్లావ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం పెరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎక్కువ మంది రైతులు సహజ సైద్యంవైపు మొగ్గుచూపుతున్నారు. పంటల సాగులో కెమికల్స్ వాడకం కారణంగా కలుగుతున్న నష్టాలపై అవగాహన కల్పించడంతో పాటు లాభాలను వివరించి రైతులకు ఆసక్తి పెంచుతున్నారు. జిల్లాలో 2016లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభం కాగా, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రత్యేకంగా బడ్జెట్ కూడా కేటాయిస్తోంది. అధికారులు, సిబ్బంది అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. దీని ద్వారా సాగుచేసిన కూరగాయలు, పంటలు తినడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుండటంతో ప్రజలు కూడా కొనుగోలు చేస్తున్నారు. క్రమంగా వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గిస్తూ వస్తున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంచుతూ ప్రజల ఆరోగ్యంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడేందుకు నడుం బిగించారు. ఫలితంగా వాతావరణ కాలుష్యం కూడా కంట్రోల్ అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లాలోని 38 మండలాలకుగానూ 857 గ్రామాలు ఉండగా, 240 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేస్తున్నారు. గతేడాది 48 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండించారు. అధికంగా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది 98 వేల ఎకరాలు లక్ష్యంగా...

జిల్లాలో ఈ ఏడాది కొత్తగా 98 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు కృషి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 3,985 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఈ విధానం ద్వారా పంటలు పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడటాన్ని నిషేధించారు.



కషాయాలు తయారు చేస్తున్న రైతులు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రతి ఆర్‌బీకే పరిధిలో అవగాహన సదస్సులు...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తూ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

పంటలకు మార్కెట్‌లో డిమాండ్...

ప్రకృతి కషాయాలతో పండించిన ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. అలాంటి పంటలు మార్కెట్లోకి వచ్చిన వెంటనే వినియోగదారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మంది అలాంటి పంటలే కావాలని కోరుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయ పంటలు వాడుతున్న వారు తమ ఆరోగ్యం బాగా మెరుగుపడిందని చెబుతుండటంతో డిమాండ్ పెరుగుతోంది. పంటలను రసాయన ఎరువులతో పండించారా, ప్రకృతి వ్యవసాయంతో సాగుచేశారా..? అని పరీక్షలు జరిపి మరీ కొనుగోలు చేస్తున్నారు.

అన్ని గ్రామాల్లో సాగుకు చర్యలు



జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. జర్మనీ, ఆస్ట్రేలియా నుంచి కూడా శాస్త్రవేత్తలు వచ్చి ప్రకృతి వ్యవసాయం బాగుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయంపై ఎంతో శ్రద్ధ చూపిస్తున్నారు.

– వి.సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ అధికారి

టీటీడీ వారు అధిక ధరకు శనగలు కొనుగోలు చేస్తున్నారు :



ప్రకృతి వ్యవసాయం ద్వారా నేను పండిస్తున్న శనగలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. తిరుపతి లడ్డూలను ప్రకృతి వ్యవసాయంతో పండించిన ధాన్యంతోనే తయారు చేయాలనే ఉద్దేశంతో ఎక్కువ ధర కూడా ఇస్తున్నారు.

– సీహెచ్ సుజాత, మహిళా రైతు, గాదెపాలెం

ఆకుకూరలు, కూరగాయలకు సైతం అధిక ధరలు



నాకున్న రెండెకరాల్లో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తాను. 100 శాతం కషాయాలతో పండిస్తాను. మా కుటుంబంతో పాటు నా కూరగాయలు కొన్నవారంతా ఆరోగ్యంగా ఉన్నారు. కూరగాయలకు ఎంతో డిమాండ్ ఉంది. పొలానికి వచ్చి మరీ అధిక ధరలకు తీసుకెళ్తున్నారు.

– పిట్టు వెంకటేశ్వర్లరెడ్డి, ఏపీసీఎంఎఫ్ లెవల్–2 యూనిట్ ఇన్‌చార్జి, వజ్జిరెడ్డిపాలెం

2016 నుంచి 2023 వరకు ప్రకృతి వ్యవసాయం వివరాలు...

సంవత్సరం	లక్ష్యం		అమలు చేసింది	
	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
2016-17	3,000	1,611	2,101	3,985
2017-18	20,005	11,018	20,152	21,997.5
2018-19	48,837	30,121	31,108	43,835
2019-20	32,624	32,624	28,424	32,247.5
2020-21	50,100	62,625	31,997	52,949
2021-22	54,879	40,367	56,842	46,480.53
2022-23	42,186	41,940.83	40,039	43,552.85

చెప్పినవన్నీ చేస్తాం

- గడపగడపలో ప్రజలు తెలిపిన సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- సిమెంటు రోడ్డును ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, తదితరులు

ఒంగోలు టౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నగరంలోని బాలాజీరావుపేట మొదటిలైనులో పోలేరమ్మగుడి వద్ద రూ.13.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చినప్పుడు ఇక్కడి ప్రజలు రోడ్డు కావాలని అడిగారని గుర్తుచేశారు. వెంటనే నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మించడం జరిగిందని చెప్పారు. ఇన్‌చార్జి మేయర్ సూర్యనారాయణ వినతి మేరకు రూ.20 లక్షల నిధులతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. వేసవి ఎండల వల్ల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొద్దిగా ఆలస్యమవుతోందని, మరికొద్ది రోజుల్లోనే ప్రారంభించి మిగిలిన అన్ని డివిజన్లలో ప్రతి ఇంటికి తిరుగుతానని బాలినేని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. నగర ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి) మాట్లాడుతూ బాలాజీరావుపేట ప్రజలు ఏళ్ల తరబడి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో ఇన్నాళ్లకు వారి సమస్య పరిష్కారమైందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో రూ.50 లక్షలతో మెయిన్ డ్రెయిన్ పూర్తి చేస్తామని తెలిపారు. తొలుత సీసీ రోడ్డు శిలాఫలకాన్ని బాలినేని ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రారంభించారు.

నీరాజనం పలికిన ప్రజలు...

సీసీ రోడ్డు ప్రారంభించిన అనంతరం బాలాజీరావుపేటలో పర్యటించిన బాలినేనికి స్థానిక ప్రజలు నీరాజనం పలికారు. పూల వర్షం కురిపిస్తూ స్వాగతించారు. ప్రతి ఇంటి వద్ద పూలమాల వేసి సన్మానించారు. ఆప్యాయంగా వారి ఇళ్లకు ఆహ్వానించారు. మహిళలు, పిల్లలు, యువకులు ఉత్సాహంగా బాలినేని వెంట నడిచారు. వారందరినీ పలకరిస్తూ బాలినేని ముందుకుసాగారు. బాలాజీరావుపేటలో తిరుపతిరావు, మధు ఇళ్లకు వెళ్లి పలకరించారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, శాండిల్య, అంబటి ప్రసాదరావు, యనమల నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి, కార్పొరేషన్ కో ఆప్షన్ మెంబర్ ఎండీ షౌకత్‌అలి, పార్టీ డివిజన్ నాయకులు మధు ఇనాయతుల్లా, శివకుమార్, అయ్యప్ప, సుజాత, కండె రమణయాదవ్, బొమ్మినేని మురళి, కరుణాకర్, గోవర్ధన్‌రెడ్డి, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డీఈఈ టి పద్మజ, ఏఈ బాలకోటయ్య, మున్సిపల్ ఇంజినీర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బాధ్యతగా చూసుకోవాలి



మద్దిపాడులో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి ఉషాశ్రీ చరణ్, అధికారులు



టంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి

- అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలి
- జిల్లాలో పలు కేంద్రాలను తనిఖీ చేసిన మంత్రి ఉషాశ్రీ చరణ్

మద్దిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత పిల్లల్లా బాధ్యతగా చూసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి కేవీ ఉషాశ్రీ చరణ్ సిబ్బందిని ఆదేశించారు. కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆమె.. పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్దిపాడు మండల కేంద్రంలోని 1వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. పలు రికార్డులు పరిశీలించారు. పిల్లలకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా చూసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలు మండలంలోని యరజర్లతో పాటు మద్దిపాడు–1 సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. పిల్లలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించాలి, వారికి పౌష్టికాహారం అందుతుందా లేదా అనే విషయాలను పరిశీలించామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు రికార్డులు పక్కాగా నిర్వహించాలని, రికార్డుల్లో ఏమైనా తేడాలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. బాలింతలకు రేషన్ సక్రమంగా ఇస్తున్నారా.. లేదా అనే దానిపై విచారణ నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారుల సంక్షేమమే తన పర్యటన ముఖ్య ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీ వర్కర్లంతా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. మంత్రి వెంట స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్డీడీ వసంతబాల, ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.ధనలక్ష్మి, మద్దిపాడు సీడీపీవో ఇవాంజలిన్, మంత్రి కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

టంగుటూరు మండలంలో ఆకస్మిక తనిఖీలు...

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం, వల్లూరు అంగన్‌వాడీ కేంద్రాలను మంత్రి ఉషాశ్రీ చరణ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో పాలు, గుడ్లు, పౌష్టికాహారం లబ్ధిదారులందరికీ అందుతుందా..లేదా.. అనే విషయాలపై ఆరా తీశారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా లబ్ధిదారులందరికీ మెనూ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లలోని రికార్డులు, ప్రీ స్కూల్ కార్యక్రమాలను పరిశీలించారు. కార్యకర్తలు, ఆయాలు సక్రమంగా విధులు నిర్వర్తించేలా సూపర్‌వైజర్లు, సీడీపీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం కేంద్రాల్లోని విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో టంగుటూరు, ఒంగోలు సీడీపీవోలు మల్లీశ్వరి, ఫణిరాజాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



బాలికల జట్టు



బాలుర జట్టు

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ జూనియర్ విభాగం ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లను గురువారం స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేశారు. స్టెప్ సీఈవో బాబూరావు, క్రీడాశాఖ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, కోశాధికారి చంద్రశేఖరరావు పాల్గొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈవో బాబూరావు మాట్లాడుతూ ప్రతిభే కొలమానంగా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విజయమే లక్ష్యంగా రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులు, యువతలో ఆసక్తి పెంపొందించేందుకు క్రీడాశాఖ చేస్తున్న కృషిని ప్రశంసించారు. సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ ఎంపిక ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో నిర్వహించే పదో జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ఎంపికైన క్రీడా జట్లకు అభినందనలు తెలిపారు.

బాలికల జట్టు...

సీహెచ్ భవ్యశ్రీ, టి.సాయి, సీహెచ్ వర్షిత (మైనంపాడు), కె.రమ్య, ఐ.అఖిల, ఇ.కీర్తన (బిట్రగుంట), టి.అనూష, టి.శ్రీలక్ష్మి (కందుకూరు), ఎ.భవిష్య సాయి, ఎస్.పవిత్ర (కొత్తపట్నం), కోచ్ కె.ప్రేమ్‌కుమార్, మేనేజర్ రాజ్యలక్ష్మి.

బాలుర జట్టు...

ఓ కార్తీక్ (ఒంగోలు), ఇ.అమిత్ (బిట్రగుంట), ఎం.క్రాంతి (కేవీ పాలెం), కె.అశ్విన్ (మంగమూరు), పీటర్ (మంగమూరు), ధనుంజయరెడ్డి (చీమకుర్తి), ఎస్.జస్వంత్ (బి.నిడమానూరు), పి.వరుణ్‌సందేష్ (బిట్రగుంట), కె.యగ్నేష్(సింగరాయకొండ), పి.హరిక్‌సాయి (ఒంగోలు), కోచ్ త్రినాథ్‌బాబు, మేనేజర్ రవి.

గురుకులాల్లో ప్రవేశాలకు రేపు పరీక్ష

ఒంగోలు: గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కామన్ అడ్మిషన్ టెస్టు ద్వారా సీట్లు భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు 1,747 మంది హాజరుకానుండగా, ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య పరీక్ష జరుగుతుందన్నారు. మొత్తం 8 సెంటర్లను ఒంగోలులోనే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు 3,699 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. వీరికి 17 సెంటర్లను కూడా ఒంగోలులోనే ఏర్పాటు చేశామని డీఈవో తెలిపారు.

ఎస్‌వోపీలను సమగ్రంగా తయారు చేయాలి

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికలకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)లను సమగ్రంగా తయారు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సప్లిమెంటరీ ఓటరు జాబితా పబ్లికేషన్‌తో పాటు సమగ్రంగా ఎస్‌వోపీ రూపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హ్యాండ్‌బుక్‌లో ఉండే సమాచారానికి అదనపు వివరాలు ఉండేలా ఎస్‌వోపీ తయారు చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డీఆర్వో శ్రీలత, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీవో అజయ్‌కుమార్, ఆర్వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బకు యువకుడు మృతి

దర్శి: పట్టణంలో వడదెబ్బకు గురై చెన్నూరి రమేష్ (36) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..రమేష్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బాగా నీరసించి అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించినట్లు తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్సై

గిద్దలూరు రూరల్: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన పట్టణ శివారులోని అర్బన్ కాలనీలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటలక్ష్మమ్మ(27)కు సెల్‌షాపులో పనిచేసే వెంకటేశ్వర్లుతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్వర్లు వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వెంకటలక్ష్మమ్మను వేధింపులకు గురిచేసేవాడు. భర్త వేధింపులు భరించలేని ఆమె చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ కొమ్ము విజయకుమారి, ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్య కారణాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మైనంపాడులో హాకీ సమ్మర్ క్యాంప్


హాకీ సమ్మర్ క్యాంప్‌లో క్రీడాకారులు

చీమకుర్తి: జిల్లా స్థాయి హాకీ క్రీడాకారులకు సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హై స్కూలులో హాకీ సమ్మర్‌క్యాంప్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. 30 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి హాకీ క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్‌డీఓ రాజేశ్వరి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రావు, సుబ్బారావుతో పాటు , పీఈటీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన ఏసురత్నం

కొత్తపట్నం: ఆరోగ్యం సరిలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పిడిన సంఘటన కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలో జరిగింది. ఎస్సీ కాలనీకు చెందిన దార్ల ఏసురత్నం (54) పంచాయతీ స్వీపరగా పని చేస్తూ ఇటీవల మానేశాడు. ఆరోగ్యం బాగులేకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 14న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు 108లో ఒంగోలు ప్రయివేటు హాస్పిటల్‌కు చేర్పించారు. అక్కడ రెండు రోజులు చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా.. గురువారం మృతి చెందాడు. ఎస్సై సాంబశివరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఈదురుగాలుల బీభత్సం


ఉమ్మడివరం రహదారిపై పడిన స్తంభాలు, చెట్లు


పుల్లలచెరువు ఎస్సీపాలెంలో ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం


పూరిమెట్లలో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు


కురిచేడులో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లు

పుల్లలచెరువు: పుల్లలచెరువులో గురువారం మధ్యాహ్నం గంట పాటు గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. పుల్లలచెరువు ఎస్సీ కాలనీలో ఇంటిపైనే స్తంభం పడింది. ఉమ్మడివరం రహదారిలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో వాహనదారులకు ఆటంకం ఏర్పడింది. కవలకుండ్లలో మామిడి కాయలు రాలిపోయాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కురిచేడు: మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో చిరుజల్లులు కురిశాయి. దీంతో కురిచేడు–దర్శి రోడ్డులో బోధనంపాడు సమీపంలో, పెనగమూరు వద్ద, అలవలపాడు అడ్డరోడ్డు వద్ద చెట్లు రోడ్డుకు అడ్డంగా పడి సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వందల ఏళ్ల నాటి భారీ చెట్లు కావడంతో రోడ్డు మొత్తం ఆక్రమించాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఎస్సై ఎం దేవకుమార్ జేసీబీతో చెట్లను రోడ్డుపై నుండి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

ముండ్లమూరు: మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని పూరిమెట్లలో పిడుగు పడడంతో గోగులముడి బ్రహ్మారెడ్డికి చెందిన ఎద్దు మృతి చెందింది. గాలులు ధాటికి ఈదర ఏడుకొండలుకు చెందిన ఇంటి రేకులు లేచిపోవడంతో అవస్థలు పడ్డారు. సాయంత్రం4 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంతంలో గురువారం సాయంత్రం కొద్ది సేపు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షానికి శివారు ప్రాంతాల్లోని రోడ్లు చిత్తడి మయంగా మారాయి.

అధికారులతో బాలినేని సమీక్ష


అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షిస్తున్న శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: కొత్తపట్నం, ఒంగోలు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం స్థానిక తన నివాసంలో సమీక్షించారు. కొత్తపట్నం, ఒంగోలు మండలాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించడం కోసం రెండు మండలాల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తపట్నం మండలంలో ఉన్న అసైన్‌మెంట్ ల్యాండ్ సమస్య పరిష్కరించాలని నాయకులు బాలినేని దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కొన్ని గ్రామాల్లో పొలాలు కొనుగోలు చేసి పేదలకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ సమస్య త్వరగా పరిష్కరించాలని ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావుకు బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, విద్యుత్ సమస్య కూడా లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా రెండు మండలాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి ఎంబుక్ వేగవంతంగా చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తపట్నం తహసీల్దారు రమణారావు, నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ శీనారెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, అగ్రికల్చరల్ జిల్లా అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, వీఆర్‌సీ రెడ్డి, మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

- తిమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల నిర్వాకం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన


మృతిచెందిన గర్భిణి సంధ్య


ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగులుప్పలపాడు: పురిటి నొప్పులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన గర్భిణి.. వైద్యులు నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిందని మృతురాలి బంధువులు ఆరోపించారు. ఈ ఘటన గురువారం తిమ్మసముద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబం తెలిపిన సమాచారం మేరకు.. తిమ్మసముద్రం ఎస్సీ కాలనీకి చెందిన తేళ్ల సంధ్య (27), రాజు దంపతులకు గతంలో ఇద్దరు మగ పిల్లలున్నారు. ఈ క్రమంలో మూడో సారి గర్భం దాల్చిన సంధ్య గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే మందులు వాడుకుంటోంది. పురిటి నొప్పులు రావడంతో ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆసుపత్రి వైద్యులు రాకపోవడంతో హెడ్ నర్సు సంధ్యకు.. నొప్పులు వస్తున్న సమాచారాన్ని ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రసన్నకు తెలియజేసింది. దీంతో హుటాహుటిన ఆసుపత్రికి వచ్చిన డాక్టర్ సువర్ణరాజు, డాక్టర్ ప్రసన్న సంధ్యకు సాధారణ కాన్పు చేయడానికి ప్రయత్నించడంతో రక్తనాళాలు తెగి తీవ్ర రక్తస్రావమైంది. ఈ ఘటనతో ఆందోళనకు గురైన ఇరువురు వైద్యులు 108 అంబులెన్స్‌లో సంధ్యను చీరాల ఏరియా ఆసుపత్రికి పంపించగా అప్పటికే మృతి చెందినట్లు చీరాల వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తిమ్మసముద్రం వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి చెందిందని మృతదేహంతో బంధువులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వివాహిత దారుణ హత్య


కోటా రాధ (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

వెలిగండ్ల: మండలంలోని జిళ్లెళ్లపాడు గ్రామానికి చెందిన కోటా రాధ (35) హత్యకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం...జిళ్లెళ్లపాడు గ్రామానికి చెందిన కోటా రాధకు, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన మోహన్‌రెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. భర్త మోహన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వీరు హైదరాబాద్‌లో కాపురం ఉంటున్నారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్ నుంచి జిళ్లెళ్లపాడు గ్రామానికి వచ్చారు. భర్త మోహన్‌రెడ్డి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయాడు. రాధ కుమారుడిని తీసుకొని కనిగిరి వెళ్లి వస్తానని తండ్రి సుధాకర్‌రెడ్డితో చెప్పి వెళ్లింది. కనిగిరిలో ఉంటున్న బాబాయి వద్ద కుమారుడిని వదిలిపెట్టి బజారులో పని ఉంది చూసుకొని వస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి 10 గంటలకు కూడా రాధ ఇంటికి రాకపోవడంతో సుధాకర్‌రెడ్డి, అతని తమ్ముడు కనిగిరిలో వెతికారు. అయినా కనిపించకపోవడంతో కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కనిగిరి పోలీసులు ఫోన్ లోకేషన్ జిళ్లెళ్లపాడు వద్ద చూపిస్తుందని వెలిగండ్ల పోలీసులకు తెలిపారు. వెలిగండ్ల పోలీసులు జిళ్లెళ్లపాడు అడ్డరోడ్డు వద్దకు వెళ్లి చూడగా తారురోడ్డు పక్కన ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని డీఎస్పీ రామరాజు, సీఐ శ్రీనివాసరావులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ కుమార్ తెలిపారు.

రాధ హత్యపై పలు అనుమానాలు

కోటా రాధ్య హత్యపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాధకు గన్నవరం పంచాయతీ గండ్లోపల్లికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మధ్య ఆర్థిక లావాదేవీల కారణంగా ఈ హత్య జరిగి ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గండ్లోపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇటీవల ఐపీ పెట్టినట్లు సమాచారం. హత్యకు ఓ కారును ఉపయోగించినట్లు సమాచారం? ఈ హత్యకు ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? ఈ హత్యలో ఇంకా ఎవరైనా ప్రమేయం ఉందా? ఇవన్నీ పోలీసుల దర్యాప్తులో తెలియాల్సింది.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు


మ్యాచ్‌లో తలపడుతున్న బెంగళూరు, బాపట్ల జట్లు

నాగులుప్పలపాడు: పాలడుడు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో మద్దిరాలపాడు గ్రామంలో జరుగుతున్న మ్యాచ్ బాల్ ఇన్విటేషన్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన కరణం స్వామి రైడర్స్ బెంగళూరు, బీసీఏ బాపట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరణం స్వామి రైడర్స్ బెంగళూరు జట్టు విజయం సాధించింది. నిర్ణీత 18 ఓవర్లలో తొలుత బ్యాటింగ్ చేసిన బీసీఏ బాపట్ల జట్టు 5 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరణం స్వామి రైడర్స్ బెంగళూరు జట్టు 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం మధ్యాహ్నం 2వ మ్యాచ్‌గా రాజస్తాన్ రాకర్స్ ఒంగోలు, హైపీరియన్ స్టార్స్, తిరుపతి జట్ల మధ్య జరగ్గా రాజస్థాన్ రాకర్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాకర్స్ ఒంగోలు జట్టు 17.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ కు దిగిన హైపిరియన్ స్టార్స్ తిరుపతి జట్టు 17.3 ఓవర్లలో 136 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దీంతో తొలుత బ్యాటింగ్ బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాకర్స్ ఒంగోలు జట్టు 3 పరుగులతో విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు నిర్వాహకులు పాలడుగు రాజీవ్, సందీప్ అందజేశారు.

అక్రమ గ్యాస్ సిలిండర్లు సీజ్


అధికారుల తనిఖీల్లో పట్టుకున్న సిలిండర్లు

ఒంగోలు అర్బన్: నగరంలోని గానుగపాలెంలోని గ్యాస్ స్టవ్ సర్వీసింగ్ సెంటర్లపై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌ఓ, తహశీల్దార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా చిన్న సిలిండర్లకు పెద్ద సిలిండర్‌ల ద్వారా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న వాటిని గుర్తించి 5 దుకాణాల్లో 25 గ్యాస్‌సిలిండర్‌లను సీజ్ చేశారు. అనంతరం సిలిండర్‌లను బాలాజీ ఏజెన్సీకి తరలించారు. అక్రమాలకు పాల్పడిన దుకాణదారులపై 6ఏ కేసు నమోదు చేశారు. అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ ఎంతో ప్రమాదకరమని, ఎదైనా ప్రమాదం జరిగితే దుకాణదారులే కాకుండా సామాన్య ప్రజలకు ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయన్నారు. ఇలాంటివి పునరావృతమైతే క్రిమినల్ కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. డీఎస్‌ఓ ఉదయ్‌భాస్కర్, తహసీల్దార్ మురళి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రామకృష్ణ, అశోక్, షాజిద, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు అంజిరెడ్డి, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతో నిలిచిన పలకల ఉత్పత్తులు


ఫ్యాక్టరీలో నినాదాలు చేస్తున్న కార్మికులు

మార్కాపురం: కూలి పెంచాలని డిజైన్ స్లేట్ కార్మికులు గురువారం నుంచి సమ్మె చేస్తుండటంతో ఫ్యాక్టరీల్లో ఉత్పత్తులు నిలిచిపోయాయి. ఫ్యాక్టరీల్లోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. పారిశ్రామికవాడ నుంచి ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకెఎం రఫీ, డిజైన్ స్లేట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ కార్మికుల పాత వేతన అగ్రిమెంట్ ముగిసిందని, నూతన అగ్రిమెంట్ కోసం కూలీలు పెంపుదలకు యజమానులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. యాజమాన్యం మొండి వైఖరి వీడి వేతనాలు పెంచాలని, లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు.

సత్తా చాటిన బల్లికురవ ఎడ్లు


పోటీలను ప్రారంభిస్తున్న హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ సుబ్బయ్య

పామూరు: గంగాభవానీ తిరునాళ్ల సందర్భంగా మండలంలోని మోపాడు గంగాభవానీ ఆలయ సమీపంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవ ఎడ్ల జత సత్తాచాటి ప్రథమ బహుమతిని సొంతం చేసుకున్నాయి. బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత నిర్దేశిత సమయంలో 1641 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. టంగుటూరుకు చెందిన నక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1534.9 అడుగులతో ద్వితీయస్థానం, బల్లికురవ పావులూరి వీరాస్వామికి చెందిన రెండవ ఎడ్ల జత 1130.9 అడుగులతో తృతీయస్థానం, గిద్దలూరుకు చెందిన దుర్వేసుల నారాయణ ఎడ్లజత 1020 అడుగులమేర లాగి నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులను ప్రథమ బహుమతి బొట్లా హజరత్, మచ్చా బ్రదర్స్ రూ.25 వేలు, ద్వితీయ బహుమతి చప్పిడి కాలేష్ రూ.20 వేలు, తృతీయ బహుమతి మేకల బాషా రూ.10 వేలు, నాల్గవ బహుమతి తక్కెళ్ల మహేంద్ర రూ.5 వేలను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్ రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్యల చేతులమీదుగా ఎడ్లజతల యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, కల్లూరి రామిరెడ్డి, చప్పిడి అజయ్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, మందిరెడ్డి రామసుబ్బారెడ్డి, బొట్లా క్రిష్ణమూర్తి, చెనికల శ్రీనివాసులు దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సైకిల్ ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ దినేష్ కుమార్


సైకిల్ ర్యాలీలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఇన్‌చార్జి మేయర్ వేమూరి బుజ్జి

ఒంగోలు అర్బన్: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని రాబోయే తరాలకు చక్కని వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక సంస్థలు ఏర్పాటు చేసిన పర్యావరణ హిత జీవన విధానంపై అవగాహన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కొంతమేరకు సైకిల్ తొక్కుతూ అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మిషన్ లైఫ్ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. దీనిలో తెలిపిన 7 అంశాలకు చెందిన 75 పర్యావరణ అనుకూల చర్యలను ప్రతి ఒక్కరూ జీవన విధానంలో అలవరుచుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అలవాటుగా మార్చుకుని ఫలితం చూపాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వరకు ఈ అవగాహన కార్యక్రమాలను సచివాలయ స్థాయిలో నిర్వహించాలన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి సత్యనారాయణ, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్‌లు నాగిరెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.